ఉష్ణోగ్రత
గరిష్ఠం 41.0
కనిష్ఠం 19.9

# 'భూ భారతి'తో పటిష్టంగా రెవెన్యూ చట్టం

» కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కందుకూరు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో రెవెన్యూ చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి భూ భారతి చట్టం దోహపడుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నూతన చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ఈ చట్టంలో అధికార వికేంద్రీకణను పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు రైతుల సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్, సీసీఎల్‌కు మాత్రమే అధికారాలు ఉండేవన్నారు. నేడు తహసీల్దార్, ఆర్డీవో పరిధిలోనూ భూ పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. వీరి దగ్గర న్యాయం జరగకపోతే ఆర్డీవో, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. వచ్చే నెలలో గ్రామ స్థాయిల్లో సదస్సులను ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర టీయూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, ఉప తహసీల్దార్ శేఖర్, ఎంపీవో గీత, ఏవో లావణ్య, ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్ పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, యుగేందర్‌గౌడ్, సురేందర్, ప్రశాంత్, పుష్ప పాల్గొన్నారు.

### ఇండ్ల స్థలాల పొజిషన్ చూపండి

సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో గతంలో నిరుపేదలకు ఇచ్చిన ఇండ్ల సర్టిఫికెట్లకు స్థలాల పొజిషన్ చూపాలని బాధితులతో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కందుకూరు రెవెన్యూ పరిధిలోని 107, 788 సర్వే నెంబర్లలో ఉన్న ఇండ్ల స్థలాలకు గత ప్రభుత్వాలు నిరుపేదలకు సర్టిఫికెట్లు ఇచ్చారని, నేటికీ వారికి పొజిషన్ చూపడం లేదని వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్.. ఈ సమస్యను త్వరంగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి సూచించారు.

వేసవిలో పశువులను కాపాడుకోవాలి 7



# రియల్.. కుదేల్!



## అప్పుల ఊబిలో రియల్టర్లు

రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకప్పుడు జోరుగా సాగేది. భూముల క్రయ విక్రయాలతో రియల్‌దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగింది. వ్యాపారులు కూడా లక్షల రూపాయలను ఆర్జించారు. ప్రస్తుతం ఈ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. భూముల ధరలకు రెక్కలు రావడం, కొనుగోళ్లకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో రియల్ ఎస్టేట్ పాతాళానికి పడిపోయింది. దీంతో డబ్బులు రొటేషన్ కాకపోవడంతో వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. భూముల కొనుగోలుకు చేసిన అప్పులు తీర్చేదెలా..? వాటికి వడ్డీలు కట్టేదెలా అని తలలు పట్టుకుంటున్నారు.

- భూముల రిజిస్ట్రేషన్ల కోసం వడ్డీ వ్యాపారుల చెంతకు
- అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీ వసూలు
- గండం గట్టెక్కేందుకు ఎంతైనా పర్లేదంటున్న రియల్టర్లు
- కమీషన్, ముందస్తు వడ్డీ పేరుతో నిలువు దోపిడీ
- ల్యాండ్ రేట్లకు రెక్కలు.. నిలిచిన క్రయవిక్రయాలు
- కొనుగోళ్లపై తగ్గిన ఆసక్తి.. రొటేషన్ కాని డబ్బులు
- అగమ్యగోచరంగా రియల్ వ్యాపారుల జీవితాలు

షాద్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రియల్ ఎస్టేట్ అంతంతమాత్రంగా ఉండటంతో వ్యాపారులు భూముల కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. అయితే గతంలో అప్పులు చేసి భూములు కొన్నవారు ఇప్పుడు సతమతమవుతున్నారు. భూముల క్రయ విక్రయాలు జరగకపోవడంతో డబ్బులు రొటేషన్ కావడం లేదు. లక్షల రూపాయలు అడ్వాన్స్‌లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వడ్డీ వ్యాపారులు కూడా భూములను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని అధిక వడ్డీలకు డబ్బులు అప్పుగా ఇస్తున్నారు. లక్ష రూపాయలకు రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు వడ్డీ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. రియల్టర్లు కూడా వడ్డీ ఎక్కువైనా పర్లేదు ప్రస్తుతం ఈ గండం నుంచి గట్టెక్కుదామనే ధోరణితో అప్పు చేస్తున్నారు. తీరా తీసుకున్న

మిగతా 8వ పేజీలో...

### భూములను రిజిస్ట్రేషన్ చేసుకొని అప్పు ఇస్తున్నారు



రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపులో ఉన్నప్పుడు భూములపై పెట్టుబడులు పెట్టాం. కానీ తర్వాత క్రయ విక్రయాలు పూర్తిగా తగ్గాయి. దీంతో తాము కొనుగోలు చేసిన భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే ఆసరాగా చూసుకొని వడ్డీ వ్యాపారులు తాము పెట్టుబడిన పెట్టిన భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుని అధిక వడ్డీలు తీసుకుంటున్నారు. విధి లేక అప్పు తీసుకున్నాం. తాము పెట్టిన పెట్టుబడులు తమకు వస్తే చాలనుకునే ఈ నిర్ణయం తీసుకున్నాం.

సి.శివకుమార్, రియల్ ఎస్టేట్ వ్యాపారి, నందిగామ

### ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానని విద్యార్థి ఆత్మహత్య

» వేముల్‌నర్వలో ఘటన



శివ(ఫైల్)

కేశంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫెయిల్ అయ్యానని ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేశంపేట మండలం వేముల్‌నర్వ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అలుగొండ యాదగిరి- లక్ష్మమ్మ దంపతుల కుమారుడు అలుగొండ శివ(17), షాద్‌నగర్ పట్టణంలో మణికంఠ ఒకేషనల్ కాలేజీ ఎలక్ట్రికల్ టెక్నాలజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేసి మార్చిలో పరీక్షలు రాశాడు. ఇటీవల వెల్లడించిన ఫలితాలలో శివ నాలుగు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మానసికంగా వేదనకు గురై ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి తలుపులు తెరిచిచూడగా శివ విగతజీవిగా ఫ్యాన్‌కు వేళాడుతూ కనిపించాడు. కుమారుని మృతదేహన్ని చూసి తల్లి కన్నీరుమున్నీరుగా రోదించింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేశంపేట పోలీసులు తెలిపారు.

### ఫార్మాసిటీ నిర్వాసితులను ఆదుకోవాలి

యాచారం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్‌తో పాటు న్యాయమైన పరిహారం ఇవ్వాలని, లేకుంటే నిర్వాసితులతో కలిసి ఆందోళనలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. సోమవారం మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ భూములిచ్చిన రైతులకు ఇంకా ప్లాట్లు చూపడం లేదని ప్రశ్నించారు. వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోకుంటే తహసీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నాచేస్తామని చెప్పారు. కొత్తగా భూ భారతి యాక్ట్ వచ్చినందున ధరణిలో నిషేధిత జాబితాలో పెట్టిన 2,500 ఎకరాల భూములను రైతుల పేరిట నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వడగండ్ల బాధితులకు పరిహారం ఇవ్వాలన్నారు. నర్సింహ, విప్లవ్‌కుమార్, జగన్, జంగయ్య పాల్గొన్నారు.

# నీటి వ్యథ.. తీరేదెలా?

## భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

- రోజుల తరబడి నల్లాలు రాక ఇబ్బందులు
- లీకేజీలు, ఆన్‌ఆఫ్‌లు లేక నీరు వృథా
- వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్న ప్రజలు

యాచారం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యాచారం మండల ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. కొన్ని రోజులుగా మిషన్‌భగీరథ నీరు సరిగా సరఫరా కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గతంలో రోజు విడిచి రోజు తాగునీరు వచ్చేది. ప్రస్తుతం నాలుగైదు రోజులైనా రాకపోవడంతో తంటాలు పడుతున్నారు. మిషన్‌భగీరథ నీరు రానిరోజు స్థానికంగా

మిగతా 8వ పేజీలో...



మేడిపల్లిలో నల్లాపైప్‌నకు బిగించిన మోటార్

ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలో అవస్థలు 8

### నాలుగైదు రోజులకోమారు నీళ్లు వదులుతున్నరు



మా బస్తీకి నాలుగైదు రోజులకోమారు నల్లా నీరు పెడతారు. ఫిల్టర్ నీరు కొని తాగుతున్నాం. నల్లా నీటి కోసం ఎవరిని అడిగినా ఫలితం లేకుండా పోయింది.

- అలివేలు, మేడిపల్లి

### రెండు రోజుల్లో నీటి సమస్య తీరుస్తాం

తాటిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాలలో నీటి ఇబ్బందులు రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. ముచ్చర్ల గ్రిడ్ నుంచి సరిపడా నీరు రాకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతుంది.

సుభాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



ఫెన్సింగ్ పనులు చేస్తున్న కూలీలు

# యాచారం మండలంలో భూ సర్వే పూర్తి

యాచారం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల సర్వే పూర్తయింది. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల మధ్య 80 కిలోమీటర్ల మేర అధికారులు సర్వే చేశారు. సోమవారం నుంచి టీజీఐఐసీ అధికారులు పోలీసుల భద్రత మధ్య భూముల చుట్టూ ఫెన్సింగ్ పనులు చేస్తున్నారు. ఆయా గ్రామాలలో కోర్టు వివాదంలో ఉన్న 2500 ఎకరాల భూములకు ఫెన్సింగ్ చేయలేదు.

### కొలిక్కిరాని భూముల వివాదం

కాగా తాటిపర్తిలోని 104 సర్వే నెంబర్‌లో 80 మంది రైతులు భూములు దున్నుకుంటున్నారు. ప్రభుత్వ భూములని తెలియక రైతులు ఇన్నిరోజులు సాగు చేసుకున్నారు. ఇటీవల రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు భూముల సర్వే చేయగా రైతుల ఆధీనంలో ఉన్నవి అసైన్డ్ భూములని తేలింది. వీరిని 109సర్వే నెంబర్‌లో భూమి చూపి ఆదుకుంటామని ఇటీవల రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మాకు న్యాయం చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### నెల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తాం

నెల వ్యవధిలో తాటిపర్తి గ్రామ రైతుల సమస్యను పరిష్కరిస్తాం. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. యుద్ధ ప్రాతిపదికన ఫెన్సింగ్ వేయిస్తున్నాం. 104 సర్వే నంబర్‌లో భూములు కోల్పోయిన రైతులకు మరోచోట భూమి చూపి ఆదుకుంటాం. - ఆర్డీవో అనంతరెడ్డి

# వినోబా భావే ఆశయాలకు విఘాతం...!

- » ప్రజాప్రతినిధులు భూ దందాలు చేయొద్దు
- » అధికారులు అక్రమంగా భూములు కొనొద్దు
- » టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



విలేకరులతో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలకు చలించి, పెద్దలను ఒప్పించి పేదలకు భూములను ఇప్పించిన స్వాతంత్ర్య సమరయోధుడు, భూదానోద్యమకర్త ఆచార్య వినోబా భావే ఆశయాలకు నేటి ప్రజాప్రతినిధులు విఘాతాన్ని కలిగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి ప్రజాప్రతినిధుల భూ దందాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాంధేయవాది అయిన వినోబా భావే దేశానికి స్వాతంత్ర్యం రాగానే హైదరాబాద్‌కు వచ్చి భూదాన్ పోచంపల్లికి వెళ్లారని గుర్తుచేశారు. ఆ గ్రామ దళితవాడను సందర్శించి, వారి సమస్యలను తెలుసుకున్న వినోబా భావే అదే గ్రామానికి చెందిన భూస్వామి ఎదిరె రామచంద్రారెడ్డి ఒప్పించి వంద ఎకరాల భూమిని దానం చేయించారని గుర్తుచేశారు. ఆ తరువాత దేశ వ్యాప్తంగా భూదానోద్యమాన్ని చేపట్టి వేల ఎకరాలను సేకరించి చట్టబద్ధంగా పేదలకు పంచారని గుర్తు చేశారు. నాడు భూస్వాములు పేదల కోసం భూములను దానం చేస్తే.. నేటి రాజకీయ నాయకులు భూదందాలకు తెరలేపి, వందల ఎకరాలను పోగేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి భూ దందాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు రాజకీయాన్ని వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాటలోనే ఐపీఎస్, ఐఏఎస్‌లు నడుస్తున్నారని ఆరోపించారు. భూదాన్ భూములను సైతం కొనుగోలు చేస్తున్నారన్నారు. అవినీతి అధికారుల వల్ల సర్కార్ భూములు సైతం అన్యాక్రాంతమవుతున్నాయని, మిగిలిన వాటిని ప్రభుత్వాలు విక్రయిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకునే విధంగా చట్టం తెచ్చి, పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని బక్కని నర్సింహులు అభిప్రాయపడ్డారు. ఆయన వెంట టీడీపీ సూర్యాపేట ఇన్‌చార్జి సాతాల రాంరెడ్డి ఉన్నారు.

# ప్రజావాణికి 51 ఫిర్యాదులు



సమస్యలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. మొత్తం 51 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల సమస్యలపై వినతి

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నబోయన వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శులు బొద్రమనో నర్సింహ, పాక రామచంద్రయ్య, మంచాల మండల అధ్యక్షుడు చింతకింది జంగయ్య, జిల్లా నాయకులు జోర్క నగేష్ వినతి పత్రం సమర్పించారు. దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి తగిన విధంగా నిధులు కేటాయించాలని కోరారు. మత్స్య సొసైటీలోని సభ్యులందరికీ పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఎలాంటి షరతులు లేకుండా అందించాలని డిమాండ్ చేశారు. సహజంగా మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. రాష్ట్రంలో ఎండిపోయిన చెరువులు, కుంటలకు లీజులు రద్దు చేయాలన్నారు.

### సమాధుల స్థలాన్ని కాపాడండి

వీరసేవ సమాధుల స్థలాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర నాయకులు ప్రభులింగం కలెక్టర్ సి.నారాయణ రెడ్డిని కోరారు. చౌదరిగూడెం మండలం తొంపల్లి సర్వేనెంబర్ 161లో 35 గుంటల భూమి ఉందని, అందులో ఎన్నో ఏళ్ల నుంచి జంగమ వీరసేవ సమాజం పురాతనమైన సమాధులు ఉన్నాయని తెలిపారు. కొందరు సమాధులను కూల్చివేసి స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు.

### మతతత్వంతో రాజ్యాంగ స్ఫూర్తికి దెబ్బ



చెన్నంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ మతతత్వ రాజకీయాలతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. చెన్నంపల్లిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ఎమ్మెల్యే ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనంతరెడ్డి, మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పబ్బతి శ్రీను, వస్పుల మానయ్య, కృష్ణానాయక్, ఫరీద్, మహేశ్, రవి కుమార్, నర్సింహ, వెంకటయ్య, శ్రీశైలం, తిరుపతి, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

షాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ సెంబర్లు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, కౌన్సిల్ మెంబర్ పీసరి సతీష్‌రెడ్డిలతో కలిసి సంస్థాగత ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ మండల సెక్రటరీ రెండు పోస్టులకు 9 మంది, నాలుగు ఉపాధ్యక్ష పోస్టులకు పది మంది, ఆరు కార్యవర్గ సభ్యులకు 10 మంది పోటీలో నిలిచారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, రవీందర్‌రెడ్డి, కిరణ్, నారాయణ, జనార్ధన్‌రెడ్డి, మహేందర్, మహేష్, గోవర్ధన్, రవిచారి, అనంతం, నాజ్, రాజీవ్‌రెడ్డి, గణేష్, సురేష్, శ్రీనివాస్, మల్లేశ్, రామకృష్ణ, సునిల్, రాజ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, శ్రీనురెడ్డి పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

షాద్‌నగర్ రూరల్ : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును ప్రజలకు చెప్పాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. 'గావ్ చలో-బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాలలో పర్యటించారు. వారు మాట్లాడుతూ.. పేదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ కార్యకర్తలు వివరించి చెప్పాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, ఇస్నాతి శ్రీనివాస్, కుర్మయ్య, ప్రశాంత్, గణేష్, విష్ణు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ చెట్లు ఇక కనుమరుగు!

- రోడ్డు విస్తరణకు అడ్డొస్తున్నాయని తొలగింపునకు కసరత్తు
- బషీరాబాద్- లక్ష్మీనారాయణపూర్ మధ్య ఫోర్‌లేన్ రోడ్డు
- చెట్ల పొడవు, చుట్టు కొలతలు తీసే పనిలో ఆర్అండ్‌బీ, అటవీశాఖలు



బషీరాబాద్ ప్రధాన రోడ్డులో అటవీశాఖ నాటి పెంచిన చెట్లు

బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హరితహారం కార్యక్రమంలో భాగంగా పదేళ్ల కిందట అటవీశాఖ నాటి పెంచిన వందలాది చెట్లు త్వరలో కనుమరుగుకానున్నాయి. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం చేపట్టనుండడంతో ఆ చెట్ల తొలగింపు చర్యలకు ఉపక్రమించారు. ఈమేరకు



చెట్టు కొలతలు తీస్తున్న సిబ్బంది

చెట్ల పొడవు, చుట్టూ కొలతలు తీస్తూ జరిగే నష్టంపై ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు. తాండూరు మార్గం లక్ష్మీనారయణపూర్- బషీరాబాద్ వరకు 18కిలోమీటర్ల డబుల్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా మార్చబోతున్నారు. ఇందుకు రూ.66 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో రోడ్డు వెడల్పుకు హిటాచీలతో పనులను ముమ్మరం చేశారు. కాగా మార్గమధ్యలో నారాయణపూర్ గేటు నుంచి నవాల్గ వరకు అటవీశాఖ పదేళ్ల కిందట ఇరువైపుల వివిధ రకాల మొక్కలను నాటి పెంచింది. నేడు అవి ఏపుగా పెరిగాయి. ఇప్పుడు ఆ చెట్లు కనుమరుగు కానున్నాయి. ఈ నాలుగు లేన్ల రోడ్డు పనులకు అడ్డుగా వస్తుండంతో ఆర్అండ్‌బీ అధికారులు అటవీశాఖ అధికారులకు తొలగింపునకు అనుమతి ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఆయా శాఖల అధికారులు సంయుక్తంగా కలిసి చెట్లు ఎన్ని ఉన్నాయి.. ఏఏ చెట్లు రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయనే దానిపై సర్వే చేశారు. ఈ చెట్ల తొలగింపునకు అటవీశాఖ అనుమతి తప్పనిసరి కావడంతో ఆదిశగా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికార సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా చెట్లను లెక్కగడుతూ వాటి పొడవు, చుట్టూకొలతలు తీసేపనిలో నిమగ్నమయ్యారు. నిబంధనల ప్రకారం ఈ చెట్ల వాల్యువేషన్‌ను అంచనావేసి వాటి విలువను కట్టి పరిహారం కట్టించుకుని చెట్ల తొలగింపునకు అటవీశాఖ అనుమతి ఇస్తుందని ఓఅధికారి తెలిపారు.

## శ్రీదుర్గా మల్లీశ్వరి అలంకరణలో శివుడు



తాండూరు, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయంలో కొలువైన శివుడు సోమవారం విజయవాడలో వెలిసిన శ్రీ దుర్గా మల్లీశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు విజయ కుమార్ స్వామి వారిని అలంకరణ చేశారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈఅలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

## పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం



ఎల్‌వోసీని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని డీసీసీ అధికార ప్రతినిది గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన ఇప్పళ్ల అంజయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో చికిత్సకు ప్రభుత్వం ద్వారా రూ. 2 లక్షలు మంజూరు అయ్యాయి. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేకుండ ప్రజలంతా పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు మాలే మల్లేశ్ గౌడ్, పిప్పల్ల యాదయ్య, యాదగిరి రెడ్డి, క్యామ రాజేశ్, షాబోద్దీన్, బోసు రవి, రాజేందర్‌గౌడ్, బానుకిరణ్, శ్రీకాంత్, శ్రీను నాయక్, నరేశ్, చెన్నయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

### మురుగు కాల్వ పనుల పరిశీలన

కడ్తాల మండల కేంద్రంలోని 12, 13 వార్డులలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. రూ.10 లక్షలతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో కాల్వ నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దశలవారీగా అన్ని కొత్త కాలనీలలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, చెన్నయ్య, మహేశ్, మంకిశ్రీను, కిరణ్, యాదయ్య, బాబులు, శ్రీశైలం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బీరప్పస్వామి కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న గొల్ల కురుమలు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతల, టేకులపల్లి గ్రామాల్లో గొల్ల కురుమలు సోమవారం భక్తిశ్రద్ధలతో శ్రీ కామరతి బీరప్పస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణలతో ఒగ్గు పూజారులు కల్యాణాన్ని జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, గొల్ల బీరయ్య, సత్యనారాయణ, శ్రీశైలం, జిన్నారం మల్లేశం, గొల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ పూర్ణచంద్రరావు

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి అని వికారాబాద్ ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ కె.పూర్ణచంద్రరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అలంపల్లి ప్రాంతంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది అశోక్, జగన్, మహేష్, పాల్గొన్నారు.

## సెలవుల్లో ఊరెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి

చౌదరిగూడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ఊరు వెళ్తున్న వారు వారిళ్లలో చోరీలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. చోరీల నివారణకు కొందుర్గు మండలంలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. ఇంటికి అలారం సిస్టమ్, లేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంకులాకర్లు, లేదా వెంట తీసుకెళ్లాలని చెప్పారు. ఇంటి గేటుకు బయటి తాళం వేయొద్దన్నారు. ఇంట్లో ఒక చిన్న లైట్ ఎప్పుడూ వేసి ఉంచాలని తెలిపారు.

# మెరుగైన వైద్యసేవలు అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెద్దేముల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని గదులన్నింటినీ కలియతిరిగారు. అక్కడి వాతావరణాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషంట్, లాబరేటరీ, మందుల నిల్వ గదితోపాటు ఔట్‌పేషంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఇంకా చేపట్టాల్సిన మరమ్మతులను త్వరగా చేయించాలని సూచించారు. ఆరోగ్యకేంద్రం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చుకోవాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మందులలోటు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటని వెంటనే సరఫరా చేయిస్తామని పేర్కొన్నారు. అనంతరం బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, డాక్టర్ శ్వేత, ఇన్‌చార్జి ఎంపీడీవో రతన్‌సింగ్ తదితరులు ఉన్నారు.



పెద్దేముల్ పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# వేసవిలో పశువులను కాపాడుకోవాలి

● చల్లటి ప్రదేశాల్లో సేద తీర్చాలి ● ప్రత్యేక దానా అందజేయాలి
● పరిశుభ్రమైన నీటిని తాగించాలి ● పశుపోషణపై పశువైద్యుల సూచనలు

చేవెళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):వేసవిలో అధిక ఉష్ణోగ్రత, సూర్యరశ్మిని పశువులు తట్టుకోలేవు. ఆవు జాతి పశువులతో పోలిస్తే గేదెజాతి పశువుల శరీరం నలుపు రంగులో ఉంటుంది. వాటి శరీరంలో కొవ్వు ఉండడంతో స్వేద గ్రంధులు తక్కువ ఉంటాయి. దీంతో వాటి శరీరం త్వరగా ఉష్ణతాపానికి గురవుతాయి. ఎగపోస్తాయి. వేసవిలో గేదెలు మేత తక్కువ తింటాయి. నీరు ఎక్కువ తాగుతాయి. అందువల్ల పొట్టలో అసిటిక్ ఆమ్లం ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దీంతో పాల ఉత్పత్తి, పాలల్లో వెన్న శాతం తగ్గుతాయి. ఏ పశువునైనా ఎండల్లో కట్టేయొద్దు. ఎండ కాలంలో రేకుల షెడ్డు కంటే చెట్ల కింద కట్టేయడం మంచిది. ఏ సమయంలోనూ ఎండ సోకకుండా చూసుకోవాలి. అలాగే వర్షం వచ్చే పిడుగులు పడే ఆస్కారం ఉంటుంది కాబట్టి ఆరు బయట, లేదా గుడిసెల్లో ఉంచడం పశువులకు సురక్షితం. వేసవిలో పశుపోషణలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి అంశాలపై చేవెళ్ల పశుసంవర్ధక శాఖ వైద్యురాలు శిరీష పలు అంశాలను వివరించారు.



పశువుల షెడ్డులో గేదెలు

### వడదెబ్బ సోకకుండా చూసుకోవాలి

పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటి శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. ఎగపోస్తాయి. చెమట పడుతాయి. అధిక దాహం, బలహీన పడడం, శ్వాస పీల్చడంలో ఇబ్బంది పడుతాయి. కొన్ని సార్లు అపస్మారక స్థితికి వెళ్లి చనిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పశువుల్ని నీడ ప్రదేశాల్లోకి మార్చాలి. వెంటనే తగినంత శుభ్రమైన నీటిని అందించి చికిత్స చేయించాలి. వేసవిలో గొంతువాపు, జబ్బువాపు వంటి వ్యాధులు సోకుతాయి. కాబట్టి ముందే టీకాలు వేయించాలి. పరాన్న జీవుల నిర్మూలన మందులు పిచికారి చేయాలి. దూడల వెంట్రుకలను, పెద్ద పశువుల పొడవాటి వెంట్రుకలు కత్తిరించాలి. మురికినీరు తాగితే జీర్ణకోశ సమస్యలు వస్తాయి. ఎప్పుడూ వాటికి పరిశుభ్రమైన చల్లటి నీటిని అందుబాటులో ఉంచాలి. రెండు నెలలకో సారి నట్టల మందు తాగించాలి.

### వేడి నుంచి ఉపశమనం కల్గించాలి



వేసవిలో పశువులను ఎండలో ఎక్కువ సేపు ఉంచొద్దు. ఫైటోకూల్ వంటి పౌడర్‌ను రోజుకు 10గ్రాములు దాణాలో లేదా, 10ఎంఎల్ నీటిలో కలిపి తాగించాలి. పశువుల్లో పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు ప్రతీ 15-20నిమిషాలకు నీరు చల్లుతూ వేడి నుంచి ఉపశమనం కల్గించాలి. పశువైద్యుల సూచనలు తీసుకోవాలి.

- డాక్టర్ శిరీష, పశువైద్యురాలు, పలుగుట్ట

### పునరుత్పత్తి సమస్య

ఎండ కాలంలో పశువుల్లో హార్మోన్ల లోపంతో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. ఎండుగడ్డి ఎక్కువ తినడం వల్ల విటమిన్-ఎ, కాల్షియం, కాపర్, మెగ్నీషియం తదితర ఖనిజ లవణాల లోపాలతో తాత్కాలిక వ్యంధత్వం కలుగుతుంది. వేసవి తాపంతో పశువుల్లో ఎద లక్షణాలు బహిర్గతం కావు. కాబట్టి ఆడ పశువుల్ని జాగ్రత్తగా గమనిస్తూ.. టీజర్ బుల్‌తో ఎద కాలాన్ని గుర్తించి, వీర్య దానం చేయించాలి. గేదెలు సంవత్సరం పొడవునా ఎదకొచ్చే ఆస్కారం ఉన్నా, వేసవిలో ప్రక్రియకు విఘాతం కలుగుతుంది. కాబట్టి రైతులు పశువులపై వేడి ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలు చేయాలి. నీరు ఎక్కువ తాగి మేత తక్కువ తింటాయి కాబట్టి మేతలో మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. పచ్చిగడ్డి ఎక్కువగా అందించాలి. పాలిచ్చే పశువులకు మరింత పచ్చిగడ్డి వేయాలి. ఎండు గడ్డిలో మూగుడి గడ్డి, యూరియా గడ్డి, సుబాబుల్ ఆకులు వేయాలి. ఎండుమేత ఎక్కువ వేసినప్పుడు విటమిన్-ఎ అదనంగా అందించాలి. ఎండు దానాను రాత్రి వేళల్లో వేయాలి. పశువులు సాధారణంగా 38డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకు తట్టుకోగలవు. అంత కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే శీతల స్థితి కల్పించాలి. రేకుల షెడ్డు అయితే గడ్డి పరిచి, నీళ్లు చల్లుతుండాలి. వడగాలుల నిరోధానికి షెడ్లకు చుట్టూ పరదాలు కట్టాలి. అవసరమైతే షెడ్డులో ఫ్యాన్లు, కూలర్లు, స్ప్రింకర్లు ఏర్పాటు చేయాలి. మధ్యాహ్నం వేళ పశువులపై రెండు మూడు సార్లు నీరు చల్లాలి. తడిసిన గోనె సంచుల్ని కప్పాలి. ప్రతీ పశువుకు 3 చ.మీ కనీస స్థలాన్ని కల్పించాలి. వీలుంటే పశువులు ఊదేందుకు పెద్ద ట్యాంకులను ఏర్పాటు చేయాలి. మేతకు ఎండల్లో పంపొద్దు.

### ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా భాస్కర్‌రెడ్డి



ఘట్ కే సర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఘట్‌కేసర్ కమిషనర్ చంద్రశేఖర్ 40రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డికి సీడీఎంఏ అధికారులు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

### సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బంట్వారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఆడిట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్మయి అన్నారు. మండల కేంద్రంలోని సహకార వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ర్యాలీలో పాల్గొని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ సంఘం మరింత అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. రైతులు ముందుకు వచ్చి తమషేర్ డిపాజిట్ చేసి, వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే పలు సంఘాలు పెట్రోల్ బంక్లు, మందుల దుకాణాలు, ఇతరాత్రా వ్యాపారాలు సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈవో బ్రహ్మం, సిబ్బంది శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



దీరజ్‌కుమార్‌కు వీడ్కోలు పలుకుతున్న న్యాయవాదులు

## అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికి వీడ్కోలు

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్‌కు న్యాయవాదులు సోమవారం వీడ్కోలు పలికారు. కోర్టు ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ.. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కూడా కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన జడ్జిగా బాధ్యతుల చేపట్టిన సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండకుండా లాయర్లు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కంచి పార్థసారథి, వేణుగోపాల్, గంతల శివయ్య, కొట్టె గంగాధర్, నరసింహ, బాలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అలోక్ అగర్వాల్

## విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లు

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): బూర్గుల కేంద్రంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లు అందజేసింది. సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 21మంది ఇంటర్ విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యే వరకు ఏడాదికి లక్ష చొప్పున సంస్థ తరపున అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు సంస్థ చెనేజింగ్ డైరెక్టర్ అలోక్ అగర్వాల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమన తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న పురుషోత్తంరెడ్డి

## సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య లక్ష్యంతోనే కాక సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి చెప్పారు. హిమాయత్‌నగర్‌లోని డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో ఫలక్‌నాజ్ అనే విద్యార్థిని 'డయాబెటిక్ కాంప్లికేషన్స్' అంశంపై పరిశోధన చేయగా డాక్టరేట్ వరించింది. సోమవారం ఫలక్‌నాజ్‌కు పురుషోత్తంరెడ్డి డాక్టరేట్ అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, వీసీ శంకర్‌లింగం, ఫార్మసీ విభాగ హెడ్ కుమారస్వామి, ప్రొఫెసర్ క్రిస్టోఫర్, డీన్ రాజు, రాజేందర్‌రెడ్డి, జగదీశ్వర్, పీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.



దీక్షలో జేఏసీ నాయకులు

## కొనసాగుతున్న మండల సాధన రిలే దీక్షలు

తలకొండపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాధన కోసం గట్టిప్పలపల్లి వాసులు ఉడుంపట్టు పట్టారు. నెలల పాటు రిలే దీక్షలు చేస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటయ్యే వరకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రజలంటున్నారు. 11 పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని చేస్తున్న రిలే నిరశన దీక్షలు సోమవారంతో 176వ రోజుకు చేరాయి. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోక్ గౌడ్, వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, అంజనేయులు, శరత్‌చంద్ర, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న లారీ ఓనర్లు, డ్రైవర్లు

## లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపినాయక్

ఆమనగల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మేడిగడ్డ తండా మాజీ సర్పంచ్ గోపినాయక్ ఎన్నికయ్యారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలో లారీ ఓనర్లు, డ్రైవర్లు సమావేశమై సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపి నాయక్, ఉపాధ్యక్షుడు జహంగీర్, ప్రధాన కార్యదర్శి నరేశ్, కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారిగా సలీం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మల్లేశ్, రామస్వామి, అమర్, తిరపతయ్య, రాములు, నర్సింహ, బాలకిషన్‌సింగ్, షేర్‌ఖాన్ ఉన్నారు.

## సంపదను లూటీ చేసిన బీఆర్ఎస్



మహేశ్వరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పదకొండేళ్లు బీజేపీ ప్రజస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంటే.. ఇక్కడ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని లూటీచేసిందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌కుమార్‌ల నేతృత్వంలో సామాజిక న్యాయమే ధ్యేయంగా చేపట్టిన జై సంవిధాన్ కార్యక్రమాన్ని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నిర్వహిస్తూ ప్రజలను చైతన్యమంతం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కులగణన చేసిన ముఖ్యమంత్రి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, స్వాతంత్ర్య పితామహుడు గాంధీజీని ప్రజలు మరిచిపోయేలా బీజేపీ కుట్రలకు పన్నుతోందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజలను చైతన్యపరిచారన్నారు.



మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు



చేవెళ్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

# మే డేను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే ఒకటిన జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, సీఐటీయూ మండల కన్వీనర్ సీహెచ్.బుగ్గరాములు తెలిపారు. సోమవారం ఎలిమినేడులో మే డే పోస్టర్‌ను వారు విడుదల చేశారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకుందామని అన్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మే 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు.

చేవెళ్ల: మే డే పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయచారి చేవెళ్ల పరిధిలోని అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి శివ, శేఖర్, ఇంద్రారెడ్డి, నర్సింలు, ఐలయ్య, లింగంగౌడ్, సురేశ్, రమేశ్, శ్రీకాంత్, పురుషోత్తం పాల్గొన్నారు.

# ప్రైవేట్ సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలు

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టెలికాం సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృతపరుస్తామని బీఎస్ఎన్ఎల్ డీజీఎం జి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం షాద్‌నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెలికాం రంగంలో పోటీపెరిగిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ కూడా పోటీకి సిద్ధమైందన్నారు. ప్రస్తుతం ఆరునెలల కాలానికి ఫైబర్ నెట్ కనెక్షన్, రూటర్‌ను ఫ్రీగా అందజేస్తామన్నారు. వినియోగదాల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం జయశ్రీ, ఎస్‌డీఈ రాధిక, కిషన్, సునిత, అబ్దుల్ ఖాదర్, అనసూయ, సుశీల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్‌నెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# మతి తప్పిన కేసీఆర్..

● అందుకే స్క్రిప్ట్ రాసుకొని ప్రసంగించారు
● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): 'సాలు దొరా నీ పాలన.' అని 16 నెలల క్రితం ప్రజలు కేసీఆర్‌కు ఎన్నికల్లో బుద్ధిచెప్పినా ఆయనింకా మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. అందుకే ప్రసంగాన్ని రాసుకొచ్చి మాట్లాడారని అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికార దాహం, ఉనికిని కాపాడుకునేందుకే కేసీఆర్ బీఆర్ఎస్ వజ్రోత్సవసభను నిర్వహించారని అన్నారు. మిగులు బడ్జెట్‌తో సాకారమైన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి అధోగతి పాలుచేశారన్నారు. సామాజిక తెలంగాణ సాధిస్తామని ప్రగల్భాలు పలికిన ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. తన పాలనలో ఏమీ సాధించని కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరాన్ని కాలగర్భంలో కలిపారని, మేడిగడ్డ అని మేడిపండు చూపించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్‌ను 30శాతం కూడా పూర్తి చేయలేదని, లక్ష్మీదేవిపల్లి అంటూ ఊరడించారన్నారు. కల్వకుంట్ల కుటుంబం ఆస్తులను వెంటనే బహిర్గతం చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇక కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమవుతారని జోస్యం చెప్పారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు, కృష్ణారెడ్డి, బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే భూ భారతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైతుల, భూముల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి, ఆర్‌వోఆర్ చట్టం తెచ్చిందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం కవేలిగూడలోని ఓ గార్డెన్‌లో జరిగిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 6 వేల మంది రైతులున్నారని, త్వరలోనే గ్రామాల్లో అవగాహన సదుస్సులు నిర్వహిస్తారన్నారు. సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఆర్‌డీవో, తహసీల్దార్ స్థాయిల్లోనే సమస్యల పరిష్కరించేలా కొత్త చట్టం దోహదం చేస్తుందన్నారు. మండలంలో ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానన్నారు. బహదూర్‌గూడ, కొత్వాల్‌గూడ, ఘన్సిమియాగూడ గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్, నాయకులు నీరటి రాజు, చిన్న గోల్కొండ ప్యాక్స్ చైర్మన్ దొంణకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, అధికారులు పాల్గొన్నారు.



కేఎస్ రత్నం, నర్సింహులుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చేవెళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని వైభవం బంకిట్ హాల్‌లో సోమవారం సాయంత్రం బీజేపీ సంస్థాగత సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కమిటీలు పార్టీ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముష్కర మూకలు యాత్రికులపై అమానుషంగా దాడి చేయడం బాధాకరమన్నారు. దాయాది దేశం పాకిస్తాన్‌పై భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన సమర్థించారు. మున్సిపల్‌లో కమిటీల నిర్మాణం గురించి చర్చించి ప్రపోజల్‌ని అధిష్టానానికి పంపినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నర్సింలుగౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, భయానంద్. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాములుగౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వాసుదేవ్. మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి. నాయకులు పండిత్‌రావు తదితరులు ఉన్నారు.

## పహల్గాం మృతులకు నివాళి



కొవ్వొత్తుల ప్రదర్శనలో కాలనీవాసులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో భారత్ ఉలిక్కిపడిందని పలువురు నాయకులన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, విహారి కాలనీలో ఆదివారం రాత్రి పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అమాయక పర్యటకులను విచాక్షణ రహితంగా కాల్చిచంపడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొక్కు ప్రభాకర్, బాలేష్, మహేష్, ప్రవీణ్, ఆనంద్, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.



కొండారెడ్డిపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

## ఉగ్రవాదులను అంతమొందించాలి

కేశంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అంతమొందించాలని సామాజికవేత్త పల్లె బాలీశ్వర్ అన్నారు. కశ్మీర్‌లోని పహెల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సంతాపంగా కొండారెడ్డిపల్లిలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులు హిందువులను టార్గెట్ చేసి కాల్చి చంపడం దారుణం అన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకురాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామస్తులు డాక్టర్ లింగం, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, బుర్రి మల్లేష్‌గౌడ్, కరుణాకర్, రమేష్, పల్లె వెంకటయ్య, రాజు, శ్రీకాంత్, ప్రవీణ్, దశరథ్, మహమూద్ తదిరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జిపై రోడ్డు పనులకు మోక్షం

● తీరనున్న వాహనదారుల ఇబ్బందులు

చేవెళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మండలం ఫత్తేపూర్ బ్రిడ్జిపై రోడ్డు పనులకు మోక్షం లభించింది. దీంతో వాహనదారుల ఇబ్బందులు తీరనున్నాయి. రోడ్డు బాగలేక నాలుగైదేళ్లుగా అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జిపై రిటైనింగ్ వాల్, సీసీరోడ్డు, బ్రిడ్జి కింద రోడ్డు, వర్షం నీరు వెళ్లేందుకు డ్రైనేజీ పనులకు రూ.11కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే బ్రిడ్జి రిటైనింగ్ వాల్ పూర్తయింది. రెండు రోజుల నుంచి బ్రిడ్జిపై సీసీ రోడ్డు పనులు చేస్తున్నారు. ఇరువైపులా 7మీటర్ల సీసీ రోడ్డు వేస్తారు. ఇక రాకపోకలకు సమస్య తీరనుంది.

**నీరు నిలువకుండా చూడాలి**

ఎస్‌వీఎమ్ఎల్ కంపెనీ భారీ వాహనాలు వెళ్లేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ఫత్తేపూర్ బ్రిడ్జి కింద రోడ్డు తవ్వి తిరిగి నిర్మించారు. బ్రిడ్జికింద రోడ్డు లోతు కావడంతో వర్షపు నీరు నిలిచి మడుగు ఏర్పడుతోంది. బ్రిడ్జిపై రోడ్డు పనులు పూర్తయిన వెంటనే కింద డ్రైనేజీని సైతం నిర్మిస్తే నీరు నిలవకుండా ఉంటుందని స్థానికులు అంటున్నారు. అలాగే ఫత్తేపూర్ చౌరస్తా-శంకర్‌పల్లి చౌరస్తా వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మాణంతో పాటు మధ్యన డివైడర్‌ను ఏర్పాటుకు అప్పట్లో మాజీ మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయక కాంట్రాక్ట్ రద్దైంది. తీగలవాగు వద్ద రోడ్డు పాడైంది. శంకర్‌పల్లి చౌరస్తా-ఫత్తేపూర్ రోడ్డుకు ఈ వేసవిలోనే మరమ్మతులు చేయించాలని శంకర్‌పల్లి ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై హైదరాబాద్ ఆర్అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి స్పందిస్తూ.. బ్రిడ్జిపై సీసీ రోడ్డు పనులు పూర్తయిన వెంటనే, బ్రిడ్జికింద డ్రెయిన్ వేస్తామని, అలాగే నాలుగులేన్ల రోడ్డు పనులు సైతం ప్రారంభిస్తామన్నారు.


బ్రిడ్జిపై చేపడుతున్న రోడ్డు మరమ్మతులు

**నీరు వెళ్లేలా డ్రెయిన్ నిర్మించాలి**



ఫత్తేపూర్ బ్రిడ్జి క్రింద వర్షం నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జికింద వరదనీరు భారీగా నిలుస్తోంది. బ్రిడ్జికింద నీరు పోయేలా డ్రెయిన్ నిర్మించాలి.
- శివకుమార్, ఫత్తేపూర్ వాసి

**రోడ్డు పనులను పూర్తి చేయాలి**



ఫత్తేపూర్ చౌరస్తా-శంకర్‌పల్లి వరకు నాలుగులేన్ల రోడ్డును వెంటనే పూర్తి చేయాలి. గుంతల రోడ్డుతో ఇబ్బందిగా ఉంది. నిధులున్నా పనులు చేయకపోవడం సరికాదు. పనులు వెంటనే చేపట్టి పూర్తిచేస్తే కష్టాలు తీరుతాయి. రాత్రిపూట ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంగా ఉంది. ఫత్తేపురం రోడ్డుపై వెళ్లాలంటేనే వాహనదారులు భయపడే పరిస్థితి ఉంది.
- వెంకటేశ్, అలంఖాన్‌గూడ

## ఇబ్రహీంపట్నంలో చలివేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో సోమవారం పట్నం బస్టాండులో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల కోసం చలివేద్రాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నర్సింహ తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకట నర్సప్ప, లయన్స్ క్లబ్ కార్యదర్శి బాల్‌రాజ్, కోశాధికారి భీంరావు, సభ్యులు కేవీ రమేష్‌రాజు, మహేష్‌గౌడ్, మల్లేష్, జగన్, ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నూర్ కాలేజ్ భవనంలో కొనసాగుతున్న కేశంపేట బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం.ప్రీతి సోమవారం తెలిపారు. ఎంపీసీ, బీపీసీ కోర్సులకు మే 12 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన బాల, బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రీతి పేర్కొన్నారు.

## 'మహిళలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి'

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వరంగల్ సభలో మహిళలను కించపరిచేలా మాట్లాడిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని మహిళా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం షాద్‌నగర్ చౌరస్తాలో వారు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళా కాంగ్రెస్ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జె.నాగమణి మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే సహించలేని కేసీఆర్.. 'బస్సులో మహిళలు జుట్లు పట్టుకుని కొట్లాడుతున్నారు.' అని అనడం తగదన్నారు. కేసీఆర్ కూతురిలా లిక్కర్ దందా చేసివుంటే తాము కార్లలో తిరిగేవారమన్నారు. కార్యక్రమంలో నేతలు చంద్రకళ, మహమూద, స్రవంతి, శంకరమ్మ, పర్వీన్ పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలో అవినీతి పాలన


సమావేశంలో మాట్లాడుతున్న గూడ వీరేష్

కేశంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ గత పాలనలో తెలంగాణలో అవినీతి, అరాచన పాలన సాగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. దీనిరి కేసీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. కేశంపేటలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ కాంగ్రెస్‌పై ఏడవడమే సరిపోయిందన్నారు. కేసీఆర్ పాలనలో వారి కుటుంబమే బాగుపడిందన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వడ్డీలు కడుతున్నాడని, ప్రభుత్వ ఉద్యోగులకు 1న వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనుమగళ్ల రమేష్, మనోహర్‌గౌడ్, రావుల పెంటయ్య, తుమ్మల గోపాల్, అనసూయమ్మ, భీమయ్య, బైద పర్వతాలు పాల్గొన్నారు.

## 'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు'


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు

చౌదరిగూడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే టీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని సోనియగాంధీ కాళ్లు పట్టుకుని తెలంగాణ రాష్ట్రమిచ్చాక దళితుని సీఎం చేస్తానని మాట తప్పిన కేసీఆర్ పిట్టలదొర వేషాలు మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో పట్టుమని పది నిమిషాలు మాట్లాడేందుకు కోట్ల రూపాయాలు వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నా ఎవరికీ మైక్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో వెంకటనర్సింహారెడ్డి, నర్సింహులు, చంద్రబాబు, అజ్జు, మసూద్, యాదగిరి, దామోదర్, రాఘవేందర్‌గౌడ్, నవీన్‌గౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సేవలు అభిందనీయం

కందుకూరు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు, బాలంతలు, గర్భిణులకు పౌష్టికాహారం, విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల సేవలు అభిందనీయమని ఆకులమైలారం మాజీ సర్పంచ్ జి.కళమ్మరాజు, మాజీ ఎంపీటీసీ కరుణశ్రీసురేష్ అన్నారు. సోమవారం పంజగూడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యువేషన్ డేలో పాల్గొని చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. చిన్నారులకు టీచర్లు చేస్తున్న సేవలు గొప్పవన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, వనజ, లక్ష్మీజ్యోతి, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కళమ్మ, పద్మ

## క్రీడాస్ఫూర్తితో ఆత్మస్థైర్యం


విజేత టీంకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): యువతకు క్రీడాస్ఫూర్తి ఆత్మస్థైర్యనిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. అజీజ్‌నగర్‌లో ఓ క్రికెట్ మైదానంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్/లింగబలిజ సంఘం అధ్వర్యంలో సోమవారం క్రికెట్ టోర్నీ నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. పది టీంలు పోటీల్లో పాల్గొన్నాయి. విజేత జట్లకు యాదయ్య బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. యువత క్రీడలపై మక్కువ చూపాలన్నారు. ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీ సెల్ నాయకుడు దర్శన్, ఎల్లపల్లి శ్రీనివాస్, ప్రవీన్‌కుమార్, అజీజ్‌నగర్ చెంగలి వెంకట్‌రెడ్డి, అనిల్, మహేందర్, విష్ణునేత తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఆమనగల్లు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను, కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ కేశవులుతో కలిసి పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, నిబంధనల మేరకు కొనుగోళ్లు చేయాలని సూచించారు. రైతులు వడ్లను సరిగ్గా ఎండబోసి విక్రయానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ సీఈవో ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, మాజీ వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు మానయ్య, శ్రీకాంత్, ఫరీద్, అలీం, నాజర్, విజయ్‌రాథోడ్, జంగయ్య, కృష్ణనాయక్, మహేశ్, మైసయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, సురేందర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**కందుకూరు:** వరి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని సొసైటీ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజయేందర్‌రెడ్డి అన్నారు. ఏవో లావణ్యతో కలిసి సొసైటీ ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సన్న రకం వడ్లకు 500 బోనస్ ఇస్తామని తెలిపారు. ఎ-గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2,320, కామన్ గ్రేడ్‌కు రూ. 2,300 ధర ఇస్తామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు పొట్టి ఆనంద్, నర్ల నర్సింహ, గౌర పర్వతాలు, సాధ పాండురంగారెడ్డి, మేగవత్ చంద్రునాయక్, ఏఈవో రాజు, సొసైటీ కార్యదర్శి యాదగిరిరెడ్డి, కె.సదానంద్‌గౌడ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్, విజయేందర్‌రెడ్డి

## విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది

● ట్రాన్స్‌కో డీఈ సి.శ్యాంసుందర్‌రెడ్డి



హైదరాబాద్‌కు చేరువలో ఉన్న షాద్‌నగర్ ప్రాంతం పారిశ్రామికంగా, గృహ నిర్మాణపరంగా వేగంగా విస్తరిస్తోంది. ఈ ప్రాంతానికి భారీ పరిశ్రమలు, డేటా సెంటర్లు వస్తున్నాయి.అపార్టుమెంట్లు, ఫామ్‌హౌజ్‌లు వెలుస్తున్నాయి. విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు పెరుగుతున్నాయి. ఈ మేరకు విద్యుత్ వినియోగానికి కూడా భారీ డిమాండ్ పెరుగుతోందని ట్రాన్స్‌కో షాద్‌నగర్ డీఈ సి. శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్!

**ఫటా ఫట్**

ప్రశ్న: ఈ ప్రాంతలో ఉన్న డిమాండ్ మేరకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారా?

**జవాబు:** షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్తు డిమాండ్ పెరుగుతోంది. గతేడాది 324 మెగావాట్లు ఉన్న వినియోగం ప్రస్తుతం రోజూ 345 మెగావాట్లకు పెరిగింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: విద్యుత్తు సరఫరా వనరులు ఏం ఉన్నాయి?

**జవాబు:** డివిజన్‌లో 220/132కేవీ సబ్‌స్టేషన్లు రెండు, 132/33కేవీ సబ్‌స్టేషన్లు ఐదు, 33/11కెవి సబ్‌స్టేసన్లు 40 ఉన్నాయి. వీటి కింద 9,517 ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేస్తున్నాయి. కొత్తూర్, నందిగామ, తిమ్మాపూర్, ఫరూఖ్‌నగర్, మొగిలిగిద్ద, బూర్గుల, కిషన్‌నగర్, ఆగిర్యాల, చౌదరిగూడ సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నాం. 21కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికే 80శాతం పూర్తయ్యాయి. కొత్తూర్ మండలం పీండ్‌జీ కంపెనీ వద్ద, ఎలికట్ట అదాని డేటా సెంటర్ వద్ద 132/33కేవీ సబ్-స్టేషన్లు ఏర్పాటు చేయించుకుంటున్నాయి. వ్యవసాయం, గృహావసరాలకు ఐదు కొత్త సబ్-స్టేషన్లు మంజూరయ్యాయి.

ప్రశ్న: బిల్లులు సకాలంలో వసూలవుతున్నాయా?

**జవాబు:** షాద్‌నగర్ ప్రాంతంలో పరిశ్రమలు ఉండడంతో భారీ కలెక్షన్ వస్తుంది. ప్రతి నెల రూ.130కోట్లు వస్తుంది. వాణిజ్య, గృహ వినియోగదారులు సైతం సకాలంలో బిల్లులు చెల్లించాలి. గృహజ్యోతి కింద 39,065 కనెక్షన్లు, ఉచిత వ్యవసాయ కనెక్షన్లు 28వేలు ఉన్నాయి. వ్యవసాయానికి మరో వెయ్యి కనెక్షన్లు ఇవ్వబోతున్నాం.

ప్రశ్న: వినియోగదారుల నుంచి ఏమైనా సమస్యలున్నాయా?

**జవాబు:** నాణ్యమైన విద్యుత్తు సరఫరా కోసం శ్రమిస్తున్నాం. గాలి దుమారం, భారీ వర్షాల సమయాల్లో లైన్లు తెగి సరఫరా నిలుస్తుంది. మా పరిధి రెండు మున్సిపాలిటీలు, 220డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో 40 మంది సిబ్బందే ఉన్నారు. సాంకేతిక సమస్యలొస్తే రిపేర్లకు సమయం పడుతుంది. - షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి)

# రియల్.. కుదేల్!

(5వ పేజీ తరువాయి)

డబ్బులు చెల్లించిన తర్వాత వాటిని తిరిగి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయడానికి, లేక జీపీఏ చేస్తే అవి క్యాన్సలేషన్ కాకపోవడంతో రియల్ వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.

**ఒకప్పుడు జోరు.. ఇప్పుడు బేజారు**

షాద్‌నగర్ నియోజకవర్గం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పెట్టింది పేరు. 2004 రియల్ ఎస్టేట్ ప్రారంభమైన దశలో రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉండటం వల్ల షాద్‌నగర్ రియల్ వ్యాపారానికి కేంద్రంగా మారింది. దీంతో పాటు శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డులు దగ్గరగా ఉండటంతో ఇక్కడ రియల్ వ్యాపారం జోరుగా సాగింది. 2008 నుంచి రియల్ వ్యాపారం కాస్త డీలాపడింది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మళ్లీ ఊపందుకుంది. ఇక్కడ పెట్టుబడులకు రాష్ట్రంలోని పలువురు వ్యాపారులతో పాటు, ఏపీ, చెన్నై, కర్ణాటక తదితర రాష్ట్రాల రియల్ వ్యాపారులు కూడా పెద్దఎత్తున భూములు కొన్నారు. వీరితో పాటు సినీ పరిశ్రమతో పాటు, బడా పారిశ్రామిక వేత్తలు షాద్‌నగర్ నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం తిరిగి ఇక్కడ రియల్ భూమ్ జోరుగా సాగింది.

**ప్రస్తుత పరిస్థితి ఇది..**

గతంలో జోరుగా సాగుతున్న రియల్ వ్యాపారాన్ని చూసి వ్యాపారులు పెద్ద ఎత్తున భూముల కొనుగోలు చేశారు. ఇందుకోసం లక్షలు, కోట్లలో అడ్వాన్స్ చెల్లించారు. అడ్వాన్స్‌లు చెల్లించిన తర్వాత మూడు, లేదా ఆరు నెలల వ్యవధిలో మిగతా డబ్బులు చెల్లించి ఆయా భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రియల్ వ్యాపారం జోరుగా సాగుతున్నప్పుడు చెల్లించిన అడ్వాన్స్ మీదనే మిగతా వారికి ఎంతోకొంత లాభం చూసుకుని తిరిగి ఇతరులకు విక్రయించేవారు. వారి దగ్గర అడ్వాన్స్‌లు తీసుకుని అగ్రిమెంట్లు చేసేవారు. కానీ ప్రస్తుతం రియల్ వ్యాపారం తలకిందులయ్యే సరికి భూములు అమ్ముడు పోక, అడ్వాన్స్ రూపంలో చెల్లించిన డబ్బులను భూ యజమానులు తిరిగి ఇవ్వక పోవడంతో రియల్ వ్యాపారులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

**బాబోయ్.. ఇదేం దందా..!**

రియల్ వ్యాపారుల అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీ వ్యాపారులు కూడా రెచ్చిపోతున్నారు. రియల్టర్లు కొనుగోలు చేసిన భూములను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తున్నారు. వీరికి మధ్యవర్తిత్వం వహించిన వారికి అప్పుగా తీసుకున్న డబ్బుల నుంచి 2శాతం కమీషన్ చెల్లించాల్సి ఉంటుంది. వడ్డీ వ్యాపారులు కూడా ముందుగానే మూడు నుంచి ఆరు నెలల వడ్డీ డబ్బులు పట్టుకుని మిగతావి ఇస్తున్నారు. ఉదాహరణకు లక్ష రూపాయలు వడ్డీకి తీసుకుంటే కమీషన్లు, వడ్డీలు పోను సదరు వ్యక్తికి రూ.75వేలు మాత్రమే చేతికందుతున్నట్లు సమాచారం. తీసుకున్న అప్పు చెల్లించిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్లు క్యాన్సలేషన్ చేయడంలో వడ్డీ వ్యాపారులు రియల్ వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. కొందరు ఏజీపీలు చేస్తే తిరిగి క్యాన్సలేషన్ కావడం లేదని రియల్టర్లు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. తెలంగాణలోని కొందరు బడా రియల్ వ్యాపారులు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నారని తెలుస్తోంది. దీనివల్ల కూడా షాద్‌నగర్ నియోజకవర్గంలో రియల్ వ్యాపారం పడిపోయిందనే చర్చ కొనసాగుతోంది. భవిష్యత్తులో రియల్ రంగంలో తెలంగాణకు ఎలాంటి ఢోకా లేదని, త్వరలోనే పుంజుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

# నీటి వ్యథ.. తీరేదెలా?

(5వ పేజీ తరువాయి)

ఉన్న బోర్ నీటిని కూడా సరఫరా చేయడం లేదని గ్రామీణ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాచారం మండలంలోని గ్రామాలకు కందుకూరు మండలంలోని ముచ్చర్ల గ్రిడ్ నుంచి నీరు సరఫరా అవుతుంది. మేడిపల్లిలో మిషన్‌భగీరథ నల్లాలకు కొందరు మోటర్లు బిగిస్తుండటంతో మిగతా వారికి నీరందక ఇబ్బంది పడుతున్నారు. ఇదే గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం ముందు లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతుంది. అంతేకాకుండా వీధి నల్లాలకు ఆన్‌ఆఫ్ లేకపోవడంతో తాగునీరు రోడ్లపై పారుతోంది. 2, 11 వార్డులో నల్లానీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కుర్మిద్దలో 1,2,7,9 వార్డులు, తాటిపర్తిలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. రెండు రోజులలో నీటి ఎద్దడి తీర్చకపోతే మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## లీకేజీలతో తాగునీరు వృథా


ఉప్పరిగూడ రుక్కమ్మ ఇంటి వద్ద పైపు లీకేజీతో బయటకు వస్తున్న తాగునీరు

ఆదిభట్ల: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో 1 వార్డు పరిధిలోని సామ రుక్కమ్మ ఇంటి వద్ద తాగునీరు పైపు లీకేజీ కావడంతో నెల రోజుల నుండి నీరు వృథాగా పోతుంది. రోడ్డుపై పారుతూ మారమోని శ్రీశైలం ఇంటి వద్ద పెద్ద ఎత్తున నీరు చేరింది. పైపులైన్‌కు మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసిన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలేదు. దీంతో 1,2 వార్డులకు సరఫరా కావల్సిన నీరు నిలిపోవడంతో వార్డులలో నీటి ఎద్దడి ఏర్పడింది. లీకేజీ కారణంగా కొందరికి కలుషిత నీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు నీటి కోసం ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**నెల రోజులుగా నీళ్లు రావడం లేదు**



నెల రోజుల నుంచి పైపులైన్ లీకేజీ కావడంతో మా ఇంటికి నీళ్లు వస్తలేవు. లీకేజీ పైపునకు మరమ్మతు పనులు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మాకు నీటి సమస్య తప్పడం లేదు.
- బూడిద సావిత్రమ్మ, ఉప్పరిగూడ

**సమస్యను పరిష్కరిస్తాం**

ఉప్పరిగూడలో పైపులైన్ లీకేజీ వాస్తవమే. దీంతో ప్రజలు నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో పాటు ఉప్పరిగూడకు వచ్చే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. పైపులైన్ మరమ్మతులు చేపట్టి ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తాం.
- రవికుమార్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి

## బీఆర్ఎస్ సత్తా చాటిన రజతోత్సవ సభ

కడ్తాల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభ దేశ చరిత్రలో నిలిచిపోయిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. ప్రజలు ఉప్పెనలా కదిలిరావడంతో కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడడం లేదని పేర్కొన్నారు. కడ్తాలలో సోమవారం పరమేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఎన్ని అడ్డంకులు కలిగించినా కేసీఆర్ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. రాష్ట్రంలో వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రజతోత్సవ వేదిక గొప్ప సందేశాన్ని ఇచ్చిందని పరమేశ్ పేర్కొన్నారు. సభకు వచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్ నాయకులకు దడపుట్టిందని అన్నారు. సభను విజయవంతం చేసిన బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జోగు వీరయ్య, జంగయ్య పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

చేవెళ్ల: ఈ నెల 29వ తేదీన చేవెళ్లలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబరాక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ బి. కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే యాదయ్య చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. మొత్తం 42 మందికి చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల లబ్ధిదారులందరు సకాలంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా తహసీల్దార్ కోరారు.

**రేపు భూ భారతిపై అవగాహనా సదస్సు**

చౌదరిగూడ: కొందర్గు, చౌదరిగూడ మండలాలలో ఈ నెల 30న(బుధవారం) భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై అవగహన సదస్సు నిర్వహిస్తున్నాట్లు ఆయా మండలాల తహసీల్దార్లు రమేష్ కుమార్, జగదీశ్వర్ వేర్వేరు ప్రకటనల్లో సోమవారం తెలిపారు. రైతులు భూ చట్టాలపై అవగాహన కోసం సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఉదయం 10:30గంటలకు కొందర్గు, మధ్యాహ్నం 2 గంటలకు జిల్లేడ్ చౌదరిగూడలో సదస్సులు నిర్వహిస్తున్నాట్లు వారు తెలిపారు.

**నేడు కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో ...**

కడ్తాల్/తలకొండపల్లి: భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం-2025పై మంగళవారం కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్‌లు ముంతాజ్, నాగార్జున తెలిపారు. వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధిలోని రైతులు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి కోరారు. ప్రభుత్వ పథకాల్లో అర్హులకు అన్యాయం జరుగకుండ చూడాలని ఆయన సూచించారు. ఆమనగల్లు మండలంలో సోమవారం కృష్ణారెడ్డి పర్యటించారు. ఇటీవల మృతిచెందిన చెంచు సంఘం నాయకురాలు మండ్లీ జంగమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం మండ్లీ రాములు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను సత్కరించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో రేవంత్ మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ అలీ, ఉపాధ్యక్షుడు ఆనంద్, కాంగ్రెస్ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మానయ్య, కాలె మల్లయ్య, శ్రీను నాయక్, కుమార్ గౌడ్, మండ్లీ లక్ష్మయ్య, కండె సాయి, రాగ్య, తదితరులు పాల్గొన్నారు.


ఎనుముల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న మండ్లీ రాములు

## క్రైం కార్నర్

## మృతుడి కుటుంబీకుల రాస్తారోకో

యాచారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గునగల్‌లో వెంకటేశ్ (43), అతడి దాయాదులు మూడు గజాల స్థలం విషయంలో రెండు రోజుల క్రితం ఘర్షణ పడ్డారు. వెంకటేశ్, అతడి భార్య స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న క్రమంలో వెంకటేశ్‌కు గుండెనొప్పి వచ్చింది. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి వెంకటేశ్ బంధువులు దాయాది యాదమ్మ ఇంటిపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. తనింట్లో వస్తువులు, సామగ్రి, రూ.1లక్షల నగదు, బంగారు ఆభరణాలు పాడైనట్లు యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా తమకు న్యాయం చేయాలని వెంకటేశ్ భార్య స్వాతి, ఇద్దరు పిల్లలతో సోమవారం సాగర్-హైదరాబాద్ హైవేపై రాస్తారోకో చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ నందీశ్వర్‌రెడ్డి,ఎస్సై మధు వారితో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. నాలుగు గంటలు చర్చించినా బీష్మించడంతో పోలీసులు ఆందోళనకారులను యాచారం తరలించారు. వెంకటేశ్ బంధువులు పోలీసుల తీరును నిరసించడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. అవాంఛనీ సంఘటనలు జరగకుండా పరిస్థితిని అదుపు చేశారు.


రాస్తారోకోలో స్వాతి, ఆమె పిల్లలు


ఆందోళనకారులను సముదాయిస్తున్న పోలీసులు